29న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - నరసాపురం

ఈ నెల 29న జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని నర్సాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్, 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.విజయదుర్గ వెల్లడించారు. రాష్ట్ర, ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నుండి అందిన ఉత్తర్వుల ప్రకారం ఆయా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న నర్సాపురం టౌన్, రూరల్, మొగల్తూరు, పోలీస్ స్టేషన్లకు సంబంధించిన అన్ని క్రిమినల్ కేసులు, కుటుంబ తగాదాలు, చెక్ బౌన్స్ కేసులు, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, భూతగాదాలు ఉభయ కక్షిదారుల అభిప్రాయం మేరకు రాజీ చేసుకోవచ్చునని తెలిపారు.

నిమ్మలకు ఇరిగేషన్.. కొలుసుకు గృహ, సమాచార శాఖలు

- ప్రధాన శాఖలు జిల్లాకు దక్కడంపై అంతటా హర్షం
- జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు గాడిన పడేనా
- పోలవరం, చింతలపూడి, తాడిపూడి పూర్తిపై అంతా ఆశలు
- డెల్టా ఆధునీకరణ పనులు పట్టాలెక్కేనా
- పేదల సొంతింటి కల నెరవేరేనా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాకు ప్రధానమైన మంత్రిత్వ శాఖలు దక్కడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 12న మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన వారికి సిఎం చంద్రబాబు శుక్రవారం శాఖలు కేటాయించారు. పశ్చిమగోదావరి జిల్లాలో మంత్రి పదవి దక్కించుకున్న పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడుకి జలవనరులశాఖ (ఇరిగేషన్) కేటాయించారు. ఏలూరు జిల్లాలో మంత్రిపదవి దక్కిన నూజివీడు ఎంఎల్ఎ కొలుసు పార్థసారధికి గృహనిర్మాణం, సమాచార శాఖలు కేటాయించారు. ఇరిగేషన్, గృహనిర్మాణ శాఖలు ప్రధానమైనవి కావడంతో జిల్లాకు మేలు జరిగే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఇరిగేషన్ శాఖ దక్కిన నిమ్మల రామానాయుడు ఎంఎల్ఎ కావడంతో జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులు, డెల్టా ఆధునికీకరణపై అవగాహన ఉంది. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు, వైసిపి ప్రభుత్వంలోనూ ఆయన డెల్టా ఆధునికీకరణ పనులపై అనేక ఆందోళనలు చేయడంతోపాటు జిల్లా సమీక్షా సమావేశాల్లో గట్టిగా మాట్లాడిన దాఖలాలు ఉన్నాయి. ఇప్పుడు నిమ్మల ఇరిగేషన్ మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు మహర్దశ పట్టినా అనే చర్చ సాగుతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 29 మండలాల్లో డెల్టా ప్రాంతం విస్తరించి ఉంది. 2007లో డెల్టా ఆధునికీకరణ కోసం అప్పటి ప్రభుత్వం రూ.1400 కోట్లు వరకూ కేటాయించింది. దశాబ్దన్నర కాలం గడిచినా ఇప్పటికీ డెల్టా ఆధునికీకరణ పనులు పూర్తి కాలేదు. వైసిపి ప్రభుత్వం వచ్చాక ఆధునికీకరణ పనులు పూర్తిగా పడకేశాయి. ఇంకా దాదాపు రూ.వెయ్యి కోట్ల మేర పనులు చేయాల్సి ఉంది. కాలువలు ఎక్కడికక్కడే మెరకతేలిపోయాయి. లాకులు పాడైపోయాయి. దీంతో ప్రతియేటా భారీవర్షాలకు రైతులు వేల ఎకరాల్లో పంటలు నష్టపోతున్నారు. ఇరిగేషన్ శాఖ జిల్లాకు చెందిన నిమ్మల రామానాయుడుకు దక్కడంతో డెల్టా ఆధునికీకరణ పనులు వేగంగా జరిగే అవకాశం ఉందని అంతా భావిస్తున్నారు. దీంతోపాటు జిల్లాలో ప్రధానమైన సాగునీటి ప్రాజెక్టులు పోలవరం, చింతలపూడి, తాడిపూడి ఉన్నాయి. పోలవరం పూర్తి బాధ్యత కేంద్రానిది కావడంతో ఆ పనులు ముందుకు సాగే అవకాశం ఉంది. ఏలూరు, కృష్ణా జిల్లాల్లో నాలుగు లక్షల ఎకరాలకుపైగా సాగునీరు అందించే చింతలపూడి ప్రాజెక్టు పనులు వైసిపి ప్రభుత్వ హయాంలో పడకేశాయి. రూ.4,909 కోట్ల ప్రతిపాదనలతో రూపొందించిన చింతలపూడికి మరో రూ.1500 కోట్లు ఖర్చు పెడితే పూర్తయ్యే అవకాశం ఉంది. ఇది పూర్తయితే జిల్లాలోని మెట్టప్రాంతానికి పుష్కలంగా సాగునీరు అందనుంది. ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నిమ్మల కృషి చేయాలని అంతా ఆశిస్తున్నారు. అదేవిధంగా తాడిపూడి ఎత్తిపోతల పథకం పిల్ల కాలువల పనులు పూర్తి చేస్తే దాదాపు మరో లక్ష ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. ఆ పనులు పూర్తిచేసి మెట్ట ప్రాంతానికి సాగునీరు అందించాలని అంతా కోరుతున్నారు. ఏం జరుగుతుందో వేచిచూడాలి.

పేదల సొంతింటి కల నెరవేరేనా..

గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రిగా కొలుసు పార్థసారధికి అవకాశం దక్కింది. ఆయన సీనియర్ నాయకుడు. వైసిపి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించినప్పటికీ ఇళ్ల నిర్మాణంలో మాత్రం వెనుబడింది. దీంతో పేదల సొంతింటి కల నెరవేరకుండా పోయింది. ఏలూరు జిల్లాలో దాదాపు లక్ష ఇళ్ల నిర్మాణం కావాల్సి ఉండగా 25 వేల ఇళ్లుకూడా పూర్తికాలేదు. పశ్చిమగోదావరి జిల్లాలోనూ అదే పరిస్థితి నెలకొంది. జిల్లాలోని పేదలకు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేందుకు పార్థసారధి కృషి చేయాలని అంతా కోరుతున్నారు. అదేవిధంగా గత ప్రభుత్వ హయాంలో మండల విలేకరులకు ఇచ్చే అక్రిడిటేషన్లలో కోత విధించారు. చాలామంది అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు దక్కలేదు. అర్హులైన ప్రతి మండల విలేకరికి అక్రిడిటేషన్లు ఇచ్చేలా మంత్రి పార్థసారధి చర్యలు తీసుకోవాలని అంతా కోరుకుంటున్నారు. అంతేకాకుండా జర్నలిస్టులకు ఇంటి స్థలం తీరని కలగా మారింది. జర్నలిస్టులకు ఇళ్లస్థలాలిచ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వరద ప్రాంతాల్లో ముందస్తు చర్యలు

జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జిల్లాలోని వరద ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టడానికి ప్రణాళికలను సిద్ధం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. అధిక వర్షాల కారణంగా గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని ముంపు గ్రామాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టేందుకు ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. పెనుగొండ, మొగల్తూరు, ఆచంట, నరసాపురం, యలమంచిలి మండలాల్లోని కొన్ని గ్రామాలు వరద ముంపునకు గురవుతున్నాయన్నారు. ఈ వర్షాకాలం సీజన్‌లో ఎంత వర్షం కురవొచ్చు, ఎన్ని క్యూసెక్కుల నీరు చేరొచ్చు అనే సమాచారాన్ని వాతావరణ శాఖ ముందస్తు అంచనాలను క్రోడీకరించి సిద్ధంగా ఉండాలన్నారు. 15 లక్షల క్యూసెక్కుల నీరు వస్తే ఎన్ని గ్రామాలు ప్రభావితమవుతాయి, 20 లక్షల క్యూసెక్కుల నీరొస్తే ఎన్ని గ్రామాలపై ప్రభావం ఉంటుంది అనేది ఒక అంచనాకు రావాలన్నారు. చిన్నగొల్లపాలెం వద్ద పరిస్థితులను మెరుగుపరచాలన్నారు. చోక్ పాయింట్స్ బ్లాక్ కాకుండా చూసుకోవాలన్నారు. గట్లు బలహీనంగా ఉన్న ప్రాంతాలను ముందస్తుగా గుర్తించి ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలన్నారు. ఏదైనా గ్రామంలో వరద నీరు చేరితే పునరావాస కేంద్రాల ఏర్పాటుకు ముందస్తుగా గుర్తించాలన్నారు. సమావేశంలో నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.అచ్యుత్ అంబరీష్, కెనాల్స్ ఇఇ ఎం.దక్షిణామూర్తి, డ్రెయినేజీ ఇఇ ఎంవివి.కిషోర్, నరసాపురం ఇరిగేషన్ ఇఇ మోహన్ కృష్ణ, కోఆర్డినేషన్ సూపరింటెండెంట్ చందన దుర్గాప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ కె.కల్యాణి పాల్గొన్నారు.

సిపిఎఫ్‌ను తెరిపించండి

ఉంగుటూరు ఎంఎల్‌ఎకు కార్మికుల వినతి

ప్రజాశక్తి - గణపవరం

ఎంఎల్ఎ ధర్మరాజును కలిసిన సిపిఎఫ్ కార్మికులు

మండలంలో సరిపల్లి గ్రామంలోని సిపిఎఫ్ ఫ్యాక్టరీని తెరిపించాలని ఆ ఫ్యాక్టరీ కార్మికులు, ఉద్యోగులు ఎనిమిది రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నప్పటికీ అధికారులు, ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించకపోవడంతో మీరైనా మా సమస్య పరిష్కరించండి అంటూ ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజును కోరారు. కార్మికులు శుక్రవారం ఫత్తేపురంలో ఎంఎల్ఎను కలిసి తమ సమస్య వివరించారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం భీమవరంలో జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావుకు కూడా కార్మికులు వినతిపత్రం అందించి తమ పరిశ్రమ తెరిపించాలని కోరారు.

భూయాజమాన్య హక్కు చట్టం రద్దుపై హర్షం

ప్రజాశక్తి - నరసాపురం



నరసాపురంలో మాట్లాడుతున్న నేతలు

ఆంధ్రప్రదేశ్ భూయాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సంబంధిత దస్త్రంపై సంతకం చేయడం పట్ల నరసాపురం బార్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. అసోసియేషన్ అధ్యక్షులు చల్లా దానయ్యనాయుడు అధ్యక్షతన శుక్రవారం బార్ అసోసియేషన్ హాలులో నిర్వహించిన సమావేశంలో భూహక్కు చట్టాన్ని రద్దు చేయడంపై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా దానయ్యనాయుడు, సీనియర్ న్యాయవాదులు కానూరి స్వామినాయుడు, పోలిశెట్టి నారాయణస్వామి (బాబ్జి), పోలిశెట్టి సూరిబాబు, నల్లమిల్లి జోసఫ్, వంగల వెంకటాచార్యులు, మోచర్ల సత్యకృష్ణ, పూరిళ్ల శ్రీనివాస్, గునిశెట్టి శ్రీనివాసరావు, చేగొండి బాలాజీ, వైదాని నాగేశ్వరరావు, చదలవాడ జ్ఞానప్రకాష్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్‌జి.కుమార్ తదితరులు మాట్లాడారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజల ఆస్తులకు భద్రత లేని భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు సుదీర్ఘ కాలం ఉద్యమం నిర్వహించారని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా కొత్త ప్రభుత్వం ఈ చట్టాన్ని రద్దు చేస్తూ సిఎం సంతకం చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు బళ్ల శ్రీహరి, నారిన శ్రీనివాస్, కొప్పినీడి చిట్టిపద్మజ, నెక్కంటి క్రాంతికుమార్, కె.అమరేశ్వరావు, దొంగ నరసింహరాజు, గోడి సత్యనారాయణ, గన్నాబత్తుల వల్లభరావు, బొలిశెట్టి నవీన్, కురెళ్ల సోమశేఖర్, రంపా పుల్లాజీ, దొంగ సుభాష్‌బాబు, కోటిపల్లి శ్రీనివాస్‌మూర్తి, కొతపల్లి రమేష్, కానూరి బుజ్జి పాల్గొన్నారు.

తణుకు: భూయాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేస్తూ సిఎం చంద్రబాబు సంతకం చేయడంపై ఐలు, తణుకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ ముందు న్యాయవాదులు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ నాలుగు నెలలపాటు ఈ చట్టం రద్దు కోరుతూ న్యాయవాదులు వివిధ రూపాల్లో ఉద్యమాలు చేశారని తెలిపారు. కోర్టు విధులను బహిష్కరించి ఉపాధిని కూడా కోల్పోయారన్నారు. న్యాయవాదుల వృత్తికి రక్షణ, సమగ్ర చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించాలన్నారు. న్యాయవాదుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధికి రూ.100 కోట్లు కేటాయించాలని, బార్ కౌన్సిల్ ఆఫ్ ఎపికి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జూనియర్ న్యాయవాదులందరికీ ఐదు సంవత్సరాల వరకు ఉపాధిగా రూ.10 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఆకుల వెంకటసత్యనారాయణ, కౌరు వెంకటేశ్వర్లు, ఈద రామకృష్ణ, ఎం.సువర్ణరాజు, అనుకుల రమేష్, జి.అంబేద్కర్, కామన మునిస్వామి, చింతపల్లి నాగేశ్వరరావు, ఎంఎస్.రాజు పాల్గొన్నారు.

తణుకులో..

ప్రయివేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజులు దారుణం

చర్యలు తీసుకోవాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి - తణుకు



వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు

కార్పొరేట్, ప్రయివేటు స్కూళ్లు, కాలేజీల్లో భారీగా పెంచిన ఫీజులపై కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం ఆధ్వర్యంలో ఎంఇఒకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ప్రతి ఇంటిలో విద్యపై అవగాహన పెరగడం వల్ల తమ పిల్లలను బాగా చదివించాలనే ఆశలను కార్పొరేట్ యాజమాన్యాలు సొమ్ము చేసుకుంటున్నాయని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా బుక్స్, యూనిఫామ్స్ కూడా అమ్ముతున్నారని తెలిపారు. ప్రభుత్వ జిఒలను పక్కన పెట్టి ఇష్టానుసారంగా అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. జిఒ 117 వల్ల జిల్లాలో చాలా ప్రభుత్వ పాఠశాలలు మూసివేయడం కార్పొరేట్లకు వరం, తల్లిదండ్రులకు శాపంగా మారిందని తెలిపారు. నూతన ప్రభుత్వం ఫీజుల విషయంలో చర్యలు చేపట్టాలని ప్రతాప్ డిమాండ్ చేశారు. దీనిపై ఎంఇఒ మాట్లాడుతూ సిపిఎం ఇచ్చిన వినతిని పరిశీలించి చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో గార రంగారావు, రాజా, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రసాదరాజు

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని వసుధ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఇందుకూరి ప్రసాదరాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కుట్టు శిక్షణా కేంద్రాన్ని మెంటేవారితోటలోని స్థానిక మహిళలు, యవత ఉపయోగించుకోవాలన్నారు. ఈ కేంద్రంలో కుట్టు మిషన్, కటింగ్, ఎంబ్రాయిడరీ నేర్పుతారన్నారు. విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఛైర్మన్ బి.బలరాం మాట్లాడుతూ ఈ కేంద్రంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉచిత వైద్య సహాయ కేంద్రం, డయాగ్నొస్టిక్ సెంటర్, జనరిక్ మందుల షాపు, ఆక్యుప్రెజర్, ఉచిత మెడికల్ క్యాంపులు, మజ్జిగ చలివేంద్రాలు ఈ విధంగా అనేక కార్యక్రమాలు దాతల సహకారంతో నిర్వహిస్తున్నట్లు వివరించారు. దానిలో భాగంగానే ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని మెంటేవారితోటలోని మహిళలకు శిక్షణ ఇచ్చేందుకు కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. మహిళలు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అభివాదం చేస్తున్న బిసి నేతలు

'పితానికి మంత్రి పదవి ఇవ్వాలి'

ప్రజాశక్తి - వీరవాసరం

మాజీ మంత్రి పితాని సత్యనారాయణకు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని గౌడ, శెట్టిబలజ, ఉపకులాల నాయకులు కోరారు. శుక్రవారం నవుడూరులో టిడిపి బిసిసెల్ భీమవరం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పితాని సత్యనారాయణ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఉభయ గోదావరి జిల్లాలో అధికంగా ఉన్న గౌడ, శెట్టిబలిజ ఓటర్లు అధిక సంఖ్యలో ఎన్‌డిఎ కూటమికి ఓట్లు వేశారన్నారు. ఈ నేపథ్యంలో సీనియర్ నాయకులుగా ఉన్న పితానికి మంత్రి పదవి కేటాయించాలన్నారు. దీనిపై చంద్రబాబును, పవన్‌కళ్యాణ్‌లను కలవనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, బిసి నాయకులు వీరవల్లి చంద్రశేఖర్, కవురు భాస్కరరావు, కడలి నెహ్రు, అంగర కుటుంబరావు,డి.అప్పారావు, రామ చంద్రుడు, కవురు శివకృష్ణ, పాలా మహేంద్ర పాల్గొన్నారు.

జలవనరుల శాఖ కేటాయింపుపై నిమ్మల హర్షం

చంద్రబాబు, పవన్‌కు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలో కీలకమైన జల వనరుల శాఖ మంత్రిగా బాధ్యతలు అప్పగించినందుకు సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు మంత్రి నిమ్మల రామానాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు అమరావతిలో ఆయన సిఎం జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రైతాంగానికి సేవలందించే బాధ్యతను అప్పగించినందుకు రైతు బిడ్డగా ఎంతో ఆనందపడుతున్నానన్నారు. రాష్ట్ర మంత్రిగా అవకాశం రావడానికి తనను మూడోసారి ఎంఎల్‌ఎగా ఎన్నుకున్న నియోజకవర్గ ప్రజలందరికీ రుణపడి ఉంటానని చెప్పారు.

ఉద్యాన వ్యర్థాల నుండి సంపద

ప్రాజెక్టుకు ఎంపికైన డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సహకారంతో గోదావరి క్లస్టర్ యూనివర్సిటీల ద్వారా వేస్ట్ టు వెల్త్ అనే అంశంపై తగిన సాంకేతికత అభివృద్ధి చేయడానికి వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఎపి నిట్, రాజమండ్రి ఆదికవి నన్నయ్య యునివర్సిటీ కలిసి చేయనున్న ప్రాజెక్టుకు ఎంపిక చేయడం చాలా సంతోషకరమని ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్ తెలిపారు. రెండు సంవత్సరాల వ్యవధిలో రూ.10 లక్షల వ్యయంతో నిర్వహించే ఈ ప్రాజెక్టు పత్రాలను ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ డిఆర్.సలోమి సునీత (యూనివర్సిటీ బయోకెమిస్ట్రీ విభాగ అధిపతి)కు అందజేస్తూ సమాజ ఆరోగ్యాన్ని పరిరక్షించే ఈ ప్రాజెక్టు చాలా ప్రయోజనకరమన్నారు. విలువైన పరిశోధనలు జరపాలని సూచించారు. వేస్ట్ టు వెల్త్ అనే ప్రయోజనాత్మక అంశం దిశగా బత్తాయి, నిమ్మ, నారింజ, జామ వంటి పండ్ల తొక్కల్లో అధికంగా లభించే పెక్టిన్ అనే పదార్థాన్ని సాధారణంగా వ్యర్థంగా పడేస్తారని, దానిని వేరుచేసి, విలువ జోడించడం ద్వారా న్యూట్రాస్యూటికల్‌గా మార్చుడం, ఆహారం, ఫార్మా వంటి పరిశ్రమల్లో ఆరోగ్య సంబంధమైన ప్రయోజనాత్మక పదార్థంగా అధునాతన యుగానికి ఆరోగ్యకరమైన జీర్ణ వ్యవస్థ కలిగి ఉండటానికి ఈ ప్రాజెక్టు పరిశోధనలు ఎంతో దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయ ఉన్నత అధికారులు డీన్ ఆఫ్ హార్టికల్చర్ డాక్టర్ ఎఎస్.పద్మావతమ్మ, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎల్.నారంనాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డివి.స్వామి, డీన్ పీజీ స్టడీస్ డాక్టర్ ఎస్.సూర్యకుమారి ఈ ప్రాజెక్టు బృందానికి అభినందనలు తెలిపారు.



ప్రాజెక్టు పత్రాలను అందిస్తున్న జానకీరామ్

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచండి

డిపిఒ ఆర్.విక్టర్

ప్రజాశక్తి - గణపవరం

చెత్త తొలగింపును పర్యవేక్షిస్తున్న డిపిఒ

మండలంలోని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అధికారులదేనని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ అన్నారు. పారిశుధ్య వారోత్సవాల సందర్భంగా శుక్రవారం గణపవరంలో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ రోడ్లపై చెత్త, మురుగునీరు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పారిశుధ్యం క్షీణిస్తే ప్రజలకు రోగాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పంచాయతీ అధికారులందరూ పారిశుధ్యంపై దృష్టి పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గణపవరం సర్పంచి మోర అలంకారం, ఎంపిడిఒ సూర్యనారాయణ, కార్యదర్శి డిఎస్ఆర్.ప్రసాద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి నిమ్మల హయాంలో పోలవరం పూర్తి

మాజీ ఎంఎల్‌సి అంగర

ప్రజాశక్తి - పాలకొల్లు

కాటన్ విగ్రహం వద్ద రైతు నేతలు

ఐదేళ్ల జగన్ పాలనలో నిర్లక్ష్యానికి గురైన జల వనరుల శాఖను నిమ్మల రామానాయుడుకు ఇవ్వడం సబబు అని మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ చెప్పారు. నిమ్మలకు జలవనరుల శాఖ ప్రకటించిన వెంటనే శుక్రవారం సాయంత్రం స్థానిక జలవనరుల కార్యాలయం వద్ద కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నీటి సంఘాలకు చెందిన టిడిపి నేతలు, రైతులు, టిడిపి శ్రేణులు కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంగర మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయకుండా జగన్ కాలయాపన చేశారని, అందుకే ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారని అన్నారు. నిమ్మల రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేయడానికి కృషి చేస్తారని చెప్పారు. ముఖ్యంగా కేంద్రం సహాయంతో పోలవరం ప్రాజెక్టు టిడిపి హయాంలోనే పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రైతు నాయకులు పెచ్చెట్టి బాబు, జివి, పెన్మెత్స రామభద్రరాజు, రుద్రరాజు సత్యనారాయణరాజు, మాతా రత్నంరాజు, బాలి ఏడుకొండలు, పాలవలస తులసీరావు, గాదె సుబ్బారావు, వట్టం గణేష్, ఎఇ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న అనంతలక్ష్మి, రూత్‌కళ

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - ఉండి

విద్య, వైద్య రంగాలు సమాజంలో కీలక పాత్ర పోషిస్తాయని లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వేగేశ్న అనంతలక్ష్మి, కన్నెగంటి రూత్ కళ అన్నారు. శుక్రవారం ఉండి మెయిన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయిని సిహెచ్ హెనిరీటా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అనంతలక్ష్మి, రూత్‌కళ మాట్లాడుతూ మండలంలో అనేక పాఠశాలలకు వివిధ రకాలుగా సేవలందించామని తెలిపారు. క్లబ్ అడ్మినిస్ట్రేటర్ రుద్రరాజు నరసరాజు, క్లబ్ వైస్ ప్రెసిడెంట్ గాదిరాజు రంగరాజు మాట్లాడుతూ విద్యకు పునాది ప్రాథమిక విద్య అన్నారు. దాతలు లయన్ సాగిరాజు సాంబశివరాజు దంపతుల ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తి బ్రహ్మారెడ్డి, భూపతిరాజు హరనాధ్‌రాజు, కాగిత మహంకాళి, గొట్టుముక్కల రాము, కలిదిండి సీతారామరాజు, నంబూరి కాశీ విశ్వేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి సత్యప్రసాద్‌కు అభినందనలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రిగా బాధ్యతలు స్వీకరించనున్న అనగాని సత్యప్రసాద్‌ను రాష్ట్ర విఆర్‌ఒల సంఘం రాష్ట్ర కమిటీ తరపున అభినందనలు తెలియజేస్తున్నామని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న కొద్ది రోజుల్లో మంత్రిని కలిసి ఈ రాష్ట్రంలో విఆర్‌ఒల సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖా మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌కు అభినందనలు తెలుపుతున్నామని తెలిపారు.

మద్యం విక్రేతపై కేసు నమోదు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరంలో మాంసం దుకాణం నడుపుతున్న ఒక వ్యక్తి ప్రభుత్వ మద్యాన్ని అక్రమంగా నిల్వ చేసుకుని అమ్ముతుండడంతో పోలీసులు దాడిచేసి అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ శుక్రవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం.. మసీదు సెంటర్ వద్ద షేక్ మస్తాన్‌భాషా మాంసం దుకాణం నడుపుకుంటూ కొద్ది రోజులుగా అదే దుకాణం వద్ద మద్యం అమ్ముతున్నట్లు తెలిపారు. భాషా ప్రభుత్వ దుకాణాల నుంచి మద్యం కొనుగోలు చేసి అతని దుకాణంలో అధిక ధరలకు అమ్ముతున్నట్లు తెలిపారు. విశ్వసనీయ సమాచారంతో దాడి చేశామని తెలిపారు. ఈ దాడిలో రూ.11 వేల నాలుగు వందల విలువ చేసే మొత్తం డబ్బై ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అన్నా క్యాంటీన్లు పునఃప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

టిడిపి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన, జగన్ సర్కార్‌లో మూసివేసిన అన్నా క్యాంటీన్లు మరలా టిడిపి హయాంలో పున్నప్రారంభిస్తున్నట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి తెలిపారు. అన్నాక్యాంటీన్ల వల్ల పేదల కడుపు నిండుతుందన్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ

ప్రజాశక్తి - ఆచంట

పనులను పరిశీలిస్తున్న విక్టర్

జిల్లాలో 20 మండలాల్లో 49 పంచాయతీల్లో సోమవారం నుంచి 15 రోజులపాటు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని వల్లూరు గ్రామంలో పారిశుధ్య పనులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పారిశుధ్య పనుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నేలపూడి రామ్మోహన్‌రావు, పంచాయతీ కార్యదర్శి జివివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన నేతలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మంత్రి కొల్లు రవీంద్రను శుక్రవారం విజయవాడలో స్థానిక నేతలు కలిసి అభినందనలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడలి గోపాలరావు (గోపి), దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు వట్టం గణేశ్వరరావు, టిడిపి దేవాంగ బిసి సాధికారిక సమితి నరసాపురం పార్లమెంట్ కన్వీనర్ రొబ్బి భాస్కరరావు, రజక బిసి సాధికార సమితి కన్వీనర్ నడిపూడి కృష్ణ ఉన్నారు.

కొఠాలపర్రులో అంగన్‌వాడీ పిలుస్తోంది

ప్రజాశక్తి - పెనుగొండ

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించాలని ఐసిడిఎస్ అధికారి ఎం.విజయకుమారి పిలుపునిచ్చారు. కొఠాలపర్రు గ్రామంలో అంగన్‌వాడీ పిలుస్తుంది కార్యక్రమంలో ఐదు సంవత్సరాల నిండిన పిల్లలకు ఒకటో తరగతిలో ప్రమోట్ విద్యార్థులకు గ్రాడ్యుషన్ డే నిర్మించారు. మూడు సంవత్సరాల నుంచి పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రంలో ఆటలు, పాటలు ఇంగ్లీష్ బోధనతో కూడిన విద్య నేర్పుతారని ఎం.విజయ్ కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఎన్‌ఎం డబ్ల్యూపిఎస్, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఫెర్రీ రేవు వేలం పాట

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మండల పరిషత్, కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలాల పరిధిలోని మాధవాయపాలెం ఫెర్రీ రేవు వేలం పాట గురించి చర్చించేందుకు ఈ నెల 15న జాయింట్ యాక్షన్ కమిటీ (ఐకాస) సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ ఎంవి రమణా రావు తెలిపారు. నరసాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మైలాబత్తుల సోని అధ్యక్షతన జరిగే సమావేశంలో రెండు మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారన్నారు.

లంకలకోడేరు ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు పిహెచ్‌సి డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యసౌజన్య మాట్లాడుతూ మలేరియా మాసోత్సవం సందర్భంగా సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా ప్రబలకుండా జాగ్రత్త వహించాలన్నారు. ప్రతి శుక్రవారమూ డ్రైడే పాటించాలన్నారు. ఎవరికైనా జ్వర లక్షణాలు ఉంటే ఎఎన్‌ఎం, ఆశాను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పిహెచ్ ఎన్‌పి.ఎలిజిబెత్, సూపర్‌వైజర్లు ఎస్‌కె.అమలేశ్వరరావు పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబును కలిసిన మంతెన రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

సిఎం చంద్రబాబును ఉండి మాజీ ఎంఎల్ఎ, టిడిపి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సచివాలయంలో రామరాజు చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సార్ ఎప్పుడొస్తారు.. ఎప్పుడెళ్తారో..!

తహశీల్దార్ తీరుపై విమర్శలు - ఒబిసి, ఇడబ్ల్యుఎస్ పత్రాల కోసం తహశీల్దార్ కార్యాలయం వద్ద విద్యార్థుల పడిగాపులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

తహశీల్దార్ కార్యాలయం

ఆ తహశీల్దార్ నిర్లక్ష్యం విద్యార్థుల భవిష్యత్తుకు ఆటంకంగా మారింది. కేవలం మూడు రోజులు వ్యవధిలోనే జారీచేసే ధ్రువీకరణ పత్రాలు సైతం రోజుల తరబడి కార్యాలయం వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి. సదరు తహశీల్దార్ కార్యాలయానికి వచ్చేది అతి తక్కువ. ఆ వచ్చేది కూడా ఎవరికీ తెలియని పరిస్థితి. గుర్తొచ్చినప్పుడు అలా వచ్చి ఇలా మాయమవుతారు. ఎక్కడో కాదు సాక్షాత్తూ జిల్లా కేంద్రం భీమవరంలో ఈ పరిస్థితి నెలకొంది.

భీమవరం తహశీల్దార్ తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ధ్రువీకరణాల పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సకాలంలో అవి అందక కార్యాలయం వద్ద పడిగాపులు పడుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తు అంటే ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆయనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకపక్క విద్యాసంస్థలు ప్రారంభం కావడంతో విద్యార్థులు స్కూల్ బాట పట్టారు. అయితే ఒక స్కూల్ నుంచి మరో స్కూల్‌కు, ఒక కాలేజీ నుంచి మరో కాలేజీకి జాయిన్ అయ్యే సమయంలో విద్యార్థులకు టిసితోపాటు, కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలని స్కూల్ యాజమాన్యాలు చెబుతున్నాయి. దీంతో హడావుడీగా తమ పిల్లల భవిష్యత్తు ఎక్కడ పోతుందో అని తల్లిదండ్రులు తహశీల్దార్ కార్యాలయానికి వస్తే సార్ ఉండరు. ఉన్న సర్టిఫికెట్లు ఇవ్వడానికి ఆయనకు తీరిక ఉండదు. దీంతో సుమారు 50 మంది విద్యార్థులకు సంబంధించిన కుల ధ్రువీకరణ పత్రాల కోసం తల్లిదండ్రులు తహశీల్దార్ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్నారు. గడువులోగా కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకొస్తేనే సీటు ఉంటుంది లేకపోతే తామేమీ చేయలేమంటూ పాఠశాల యాజమాన్యాలు తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకొస్తున్నాయి. దీంతో వారు ఆందోళన చెందుతున్నారు.

ముఖ్యంగా తూర్పు కాపు సామాజిక తరగతికి చెందిన వారికి బిసిడి సర్టిఫికెట్ ఇవ్వడానికి మరిన్ని ఇబ్బందులు గురి చేస్తున్నారని చెబుతున్నారు. అలాగే ఇడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ కూడా ఇవ్వట్లేదని ఆయా సామాజిక తరగతికి చెందిన విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆది ఆంధ్ర క్రిస్టియన్ సర్టిఫికెట్లు విషయంలో షెడ్యూల్ కులాలకు చెందిన పాత సర్టిఫికెట్లను తీసుకురావాలని అప్పుడే కొత్త సర్టిఫికెట్ ఇస్తానని చెప్తున్నారు అని విద్యార్థులు లబోదిబోమంటున్నారు. అధికారులు సరియైన సమాధానం చెప్పట్లేదని దీంతో తమ బిడ్డల భవిష్యత్తు ఏమవుతుందని విద్యార్థులు తల్లిదండ్రులు మదన పడుతున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఇక్కడే ఉంటున్న తమపై ఇంత వివక్ష ఎందుకని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. సమస్యను ఆర్‌డిఒ శ్రీనివాసరాజులు దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును అర్థం చేసుకుని రెవెన్యూ అధికారులు కుల ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన అందించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎంఎల్ఎ దృష్టి సారించాలి ..?

విద్యార్థులు ప్రభుత్వ రాయితీలు పొందాలంటే ఆర్థికపరమైన ధ్రువీకరణ పత్రాలు ఆయా పాఠశాలల్లో, కళాశాలల్లో అందించాలి. దీనికి సంబంధించి ఒబిసి, ఇడబ్ల్యూఎస్, ఆది ఆంధ్ర క్రిస్టియన్ ధ్రువీకరణ పత్రాల విషయంలో ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) దృష్టిసారించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

రక్తదానం ముగ్గురికి ప్రాణదానం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరంటౌన్ : మాట్లాడుతున్న జెసి ప్రవీణ్ ఆదిత్య

ఒకరి రక్తదానంతో మరో ముగ్గురికి ప్రాణదానం చేయొచ్చని, రక్తదానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య అన్నారు. శుక్రవారం స్పందన సమావేశ మందిరంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాత దినోత్సవం కార్యక్రమంలో జెసి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రోగ నివారణ కోసం, ప్రమాదాల సమయంలో బాధితుల శరీరంలో తగినంత రక్తం లేకపోతే ఒకరి రక్తం మరొకరికి ఇచ్చే విధానమే రక్తదానం అన్నారు. 18 సంవత్సరాల నుంచి 55 ఏళ్లలోపు ఉన్నవారు రక్తదానానికి అర్హులన్నారు. జిల్లాలో సుమారుగా 20 లక్షల జనాభా ఉన్నారని, వారికి 24 వేల యూనిట్లు రక్తం అవసరం అవుతుందని, అందుకు అనుగుణంగా రక్త సేకరణ జరగాలని అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టరు ప్రతిజ్ఞ చేయించారు. రక్త దాతలు, రక్తదాత ప్రోత్సాహకులు 70 మందిని జెసి, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ ఎంఎస్‌వి.శివరామ భద్రిరాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.భాను నాయక్ పాల్గొన్నారు.

తణుకు : ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా తణుకు బుద్దాల బ్లడ్ బ్యాంక్ వద్ద శుక్రవారం తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం తన బాధ్యతగా భావించి చేశానని తెలిపారు. రక్తదానం చేయడం వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడినవారమవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, మారుతీరావు, తణుకు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

గణపవరం: ప్రాణాంతక సమయంలో రక్తదానం చేస్తే మరొకరికి ప్రాణం ఇచ్చినవారు అవుతారని డాక్టర్ సంతోష్ కుమార్‌రెడ్డి అన్నారు. ప్రపంచ రక్తదాత దినోత్సవం సందర్భంగా కాశిపాడులో జరిగిన అవగాహనా సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. 18 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల్లోపు ఆరోగ్యంగా ఉన్నవారు జీవితంలో 148 సార్లు రక్తదానం చేయొచ్చన్నారు. పురుషులు మూడు నెలలకోసారి, మహిళలు ఆరు నెలలకోసారి రక్తదానం చేయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు నామాల రాజు, ఎఎన్‌ఎం శివకుమారి, రమ్యశ్రీ, వసంత, ఆశా కార్యకర్తలు వరలక్ష్మి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

నరసాపురం : ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కలెక్టరేట్లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాతల సన్మాన కార్యక్రమంలో జెసి ప్రవీణ్ ఆదిత్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి ఎందరో జీవితాలను కాపాడుతున్న రక్త దాతలు అభినందనీయులన్నారు. సరైన టైంలో రక్త దానం చేసి వారి జీవితాల్లో వెలుగు నింపారన్నారు. ఇంకా పూర్తిస్థాయిలో రక్తం అందక చాలామంది ఇబ్బంది పడుతున్నారని, రక్త దాతల సంఖ్య పెరగాలని, రక్త దానానికి యువత ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా రక్త దాన శిబిరాలను ప్రోత్సహిస్తూ, 48 సార్లు రక్త దానం చేసిన జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు కోపల్లి శ్రీనివాస్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఛైర్మన్ బదిరి రాజు, సమన్వయకర్త ఎనుముల సతీష్, చెన్నంశెట్టి నాగు పాల్గొన్నారు.

మండలంలోని యర్రంశెట్టి వారిపాలెం పంచాయతీలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించినట్లు సర్పంచి యర్రంశెట్టి నాగముత్యమాంబ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంవత్సరానికి ఒకసారి అయినా రక్తదానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఒ వి.ప్రసాద్, ఎల్‌బి.చర్ల పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ అనిల్ కిరణ్, సచివాలయ కార్యదర్శి కె.రఘురాం, ఎంపిటిసి ఆకన శ్రీదేవి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : రక్తదానం చేయడం ద్వారా దాతలు ఎంతోమంది ప్రాణాలను కాపాడుతున్నారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి తెలిపారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో బ్లడ్ గ్రూప్ చెకింగ్, రక్తదాన శిబిరాన్ని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీసరోజ తెలిపారు. రక్తదానం చేయడం వల్ల రక్తం కొరతను నివారించడంతో పాటు అనేక ప్రాణాలను కాపాడగలమని కళాశాల డైరెక్టర్ కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీ సరోజ మాట్లాడారు. ఈ సందర్భంగా 33 మంది ఆదిత్య విద్యార్థులు 33 యూనిట్ల రక్తాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె.కృష్ణ, ఎన్ఎస్ఎస్‌పిఒ పి.నాగశ్రీనివాస్, ఎపిఒ సురేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.


తణుకు : రక్తదానం చేస్తున్న ఎంఎల్ఎ ఆరిమిల్లి

భూ యాజమాన్య హక్కు చట్టం రద్దుపై హర్షం

ప్రజాశక్తి - తణుకు

భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు చేయడంపై ఐలు ఉభయగోదావరి జిల్లాల అధ్యక్షులు వి.శైలజ, ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి జిల్లా కమిటీ తరపున హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండో సంతకంగా భూ హక్కు చట్టాన్ని రద్దు చేస్తూ సంతకం చేశారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేయడం న్యాయవాదుల అభిమానానికి, ప్రజల ఆస్తుల రక్షణకు నిదర్శనమన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

తాడేపల్లిగూడెం : ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తూ రెండో సంతకం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ న్యాయవాదుల ఆధ్వర్యంలో శుక్రవారం పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, మాజీ ఎపిపి కొసులూరు శివరామకృష్ణ మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ఎంత ప్రమాదకరమైన చట్టమో ఈ సమాజానికి ముందుగా తెలియపర్చింది న్యాయవాదులే అన్నారు. యువ న్యాయవాది, టిడిపి లీగల్ సెల్ జిల్లా నాయకులు చెప్పుల వాసు మాట్లాడారు. కార్యక్రమంలో గూడెం బార్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి భూపాల్, మాజీ అధ్యక్షులు యేసుపాదం, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రెయిన్లలో సిల్టు తొలగింపు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని ప్రధాన డ్రెయిన్లలో సిల్టు తొలగింపు పనులను ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి, మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. డ్రెయిన్లనో మురుగు ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. ప్రధాన కూడళ్లలో పేరుకుపోయిన వ్యర్థాలను తక్షణం తొలగించి శుభ్రం చేయాలన్నారు. శుక్రవారం తెల్లవారుజామున నరసాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులతో ఎంఎల్ఎ మాట్లాడారు. కార్మికుల సమస్యలు తెలుసుకుని, వారికి ప్రభుత్వం తరపున అండగా ఉంటామని తెలిపారు.

పనులను పరిశీలిస్తున్న నాయకర్

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

టిడిపి పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు ఆధ్వర్యంలో స్థానిక నరసయ్య అగ్రహారంలో టిడిపి నాయకులు, ప్రజలు చంద్రబాబు చిత్రపటానికి శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంతో రాష్ట్ర ప్రజలు ఆయన చిత్రపటాలకు పాలాభిషేకాలు చేస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ ఒక్కఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ సంక్షేమాన్ని విస్మరించి విధ్వంసపాలన చేయడంతో ప్రజలు విరక్తితో తిరిగి చంద్రబాబు పాలనను తీసుకొచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, టిడిపి నాయకులు మెరగాని నారాయణమ్మ, గునుపూడి తిరుపాల్ సయ్యద్ నసీమా బేగం, మాదాసు కనకదుర పాల్గొన్నారు.

తణుకు : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన కీలక హామీల అమలుపై టిడిపి కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. స్థానిక కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం చంద్రబాబునాయుడు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబునాయుడు వెంటనే పలు వర్గాలకు ఉపకరించే 5 కీలక ఫైళ్లపై సంతకాలు చేశారన్నారు. ఉపాధ్యాయ శిక్షణ కోర్సు పూర్తిచేసిన ఎన్నికల వేళ చెప్పినట్టే మెగా డిఎస్‌సిపై తొలి, ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై రెండో సంతకం చేశారన్నారు. టిడిపి గత అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి రూ.5 కే భోజనం, టిఫిన్ అందించగా నిత్యం ప్రతి క్యాంటీన్‌లో వందలాది మంది తిని ఆకలి తీర్చుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో దొమ్మేటి వెంకటసుధాకర్, బసవ రామకృష్ణ, కౌరు వెంకటేశ్వర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'రానున్న రోజుల్లో హామీలన్నీ అమలు'

ప్రజాశక్తి - నరసాపురం

ఎన్‌డిఎ కూటమిలో రానున్న రోజుల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు అవుతాయని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేశారన్నారు. రానున్న రోజుల్లో చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి వైపు నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, వాతాడి ఉమా,అధికారి అనంత రామారావు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన తొలి రోజే డిఎస్‌సి, స్కిల్స్ సెన్సెస్‌పై సంతకం చేయడం పట్ల నిరుద్యోగ యువత హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా నిరుద్యోగ యువకులు మాట్లాడుతూ డిఎస్‌సి నిర్వహించకుండా గత ప్రభుత్వం కాలయాపన చేసిందన్నారు. మెగా డిఎస్‌సి కోసం ఎంతోకాలంగా ఎదురు చూస్తున్నామన్నారు. చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. ఈ నిర్ణయంతో తమ జీవితాల్లో కొత్త వెలుగులు నింపాయని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి - ఉండి

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉండి పిహెచ్‌సి సిబ్బంది అన్నారు. శుక్రవారం అర్తమూరులో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేని పక్షంలో దోమలు విజృంభించి వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉందని అన్నారు. మురుగునీరు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లి దోమల మందు పిచికారీ చేయాలని వారు సూచించారు. దోమ తెరలు వాడడం వల్ల దోమ కాటు నుండి తప్పించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S. No. 334/2023

బిట్వీన్:
శ్రీమతి యాళ్ళ విమల -వాది
మరియు
శ్రీ యాళ్ళ రాము మరియు యితరులు -ప్రతివాదులు

3వ ప్రతివాది: శ్రీమతి గాతం లీలాకుమారి, భర్త: శ్రీ దాసు, ఎస్.సి. కాలనీ, అడవికొలను గ్రామం, నిడమర్రు మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా.

పై నెంబరు గ్రంథంలో శ్రీ కోర్టు వారి ద్వారా 3వ ప్రతివాదికి సమన్లు పంపించినప్పటికి వాటిని తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు ది. 18-06-2024వ తేదీన ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని ఆక్షేపణలు ఏమైన ఉన్నచో తెలుపవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడును.

అద్దంకి విజయరత్నం
అడ్వకేట్
తాడేపల్లిగూడెం తాడేపల్లిగూడెం
తేది:13-6-2024 సెల్: 9290188928

ప్రకటన
డాక్యుమెంట్ పోయినది

నా క్లయింటు ఆకుల రేణుక సత్య అనుపమ, భర్త: ఆకుల వీరాంజనేయులు, అత్తిలి మండలం, బల్లిపాడు గ్రామము, డోర్ నెం. 2-42రు కాపురస్తురాలు వారిచ్చిన సంజాయిషీపై తెలియజేయునది ఏమనగా,

నా క్లయింట్ అయిన ఆకుల రేణు సత్య అనుపమ, భర్త: ఆకుల వీరాంజనేయులు నా క్లయింట్‌కు గల శ్రీ తణుకు సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసు వారి పరిధిలో లింక్ దస్తావేజు నెం. 3161/1991 రుగా ది. 12-08-1999 తేదీన రిజిస్ట్రేషన్ కాబడి తణుకు మండలం, తణుకు పట్టణం, టి-వేమవరం, ఆర్.ఎస్. నెం. 54/6రు దాఖలా చ॥గ॥ 246-12లు ఖాళీ నివేశ్న స్థలమును గురించి అనగా సదరు లింక్ దస్తావేజు జిరాక్స్ కావలసియుండి ది. 18-05-2024వ తేదీ సాయంత్రం సుమారు గం॥ 4.00ల సమయములో ఆమె యింటి వద్ద నుండి అనగా బల్లిపాడు నుండి అత్తిలి జిరాక్స్ షాపునకు లింక్ దస్తావేజును తీసుకొని ఆటోలో వెళ్ళి వస్తుండగా దస్తావేజు పెట్టుకున్న కవర్ పోయినది. ఆ కవర్‌లో లింక్ డాక్యుమెంట్ (ఒరిజినల్) ఉన్నది. నా క్లయింట్ జిరాక్స్ సెంటర్‌కు వెళ్ళి చూచుకొనగా దారిలో దొరకలేదు. నా క్లయింట్ వచ్చిన దారినే మరలా వెనక్కి వెళ్ళి వెదికినది. కాని నా లింక్ డాక్యుమెంట్ పెట్టుకున్న కవర్ దొరకలేదు.

కావున ఏవన్నందికి తెలియజేయునది ఏమనగా సదరు పైన తెలిపిన లింక్ ఒరిజినల్ దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింద తెలిపిన నా క్లయింట్ అడ్రస్‌కు గాని, నాకు గాని తెలియజేయ ప్రార్ధన.

నా క్లయింట్ చిరునామా:
ఆకుల రేణుక సత్య అనుపమ, C/o. వీర రాఘవులు, పంచాయతి ఆఫీస్ రోడ్, బల్లిపాడు గ్రామము, అత్తిలి మండలం, ప॥గో॥జిల్లా, సెల్: 9849120270

చింతపల్లి నాగేశ్వరరావు
అడ్వకేట్ అండ్ నోటరీ
తణుకు మండలం, ప॥గో॥జిల్లా
సెల్: 9949476923

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి తాడేపల్లిగూడెం వారి కోర్టులో
ఓ.ఎస్.నెం.29/2022

బిట్వీన్:
రైతు డిపోట్ పెర్టిలైజర్స్ హోల్ సేల్ & రిటైల్ ప్రొ: చిన్ని లక్ష్మీనారాయణ. ...వాది
అండ్
1) మురళి కృష్ణ ట్రేడర్స్, ప్రొ: కలగర మురళీకృష్ణ.
2) కలగర మురళీ కృష్ణ. ...ప్రతివాదులు

ప్రతివాదులు:
1) మురళీ కృష్ణ ట్రేడర్స్, డో.నెం.1/49, మెయిన్ రోడ్, లింగపాలెం మండలం, ములగలంపాడు - 534462, ప॥గో॥జిల్లా /ఏలూరు జిల్లా, ఆం॥ప్ర॥.
2) కలగర మురళీ కృష్ణ, తండ్రి: భాస్కరరావు, లింగపాలెం మండలం, ములగలంపాడు - 534462, ప॥గో॥జిల్లా /ఏలూరు జిల్లా, ఆం॥ప్ర॥.

పై నెంబరు గ్రంధమునందు మీకు అనేక పర్యాయములు నోటీసు పంపియున్ననూ సదరు నోటీసును ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారంమీకు ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా సదరు పై గ్రంధములో సదరుపై గ్రంధములో ది.20-06-2024 వాయిదా తేదీ అయి ఉన్నది. కావున సదరు వాయిదాకు మీరు గాని, మీ తరుపు న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట ది.20-06-2024వ తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరు అయి మీయొక్క ఆక్షేపణలు తెలియజేసుకొనగలరు. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

మేడిది చిన్న కృష్ణమాచార్యులు
న్యాయవాది, తాడేపల్లిగూడెం.
సెల్: 70360 76151

దేవాదాయ-ధర్మాదాయ శాఖ
భూములు కౌలు హక్కునకు టెండరు-కమ్-బహిరంగ వేలం ప్రకటన

పశ్చిమగోదావరి జిల్లా, తణుకు మండలం, తేతలి గ్రామంలో వేంచేసియున్న శ్రీరాజేశ్వరస్వామి వారి దేవస్థానం సంపూర్ణ హక్కు భుక్తములోని య.4.79 సెంట్ల భూమిని ఈ క్రింది తెలియపరచిన విధముగా ప్రతులుగా శ్రీ స్వామి వారి ఆలయము నందు ది.26.06.2024వ తేదీ ఉదయం గం.10.00లకు కౌలు హక్కునకు 3 సం॥లకు అనగా 2024-2025 సం॥ము నుండి 2026-2027 సం॥ము వరకు బహిరంగ వేలం నిర్వహించబడును. ఆసక్తి గలవారు ఆయా ప్రతులకు నిర్ణయింపబడిన ప్రకారము ప్రధమ ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవచ్చును. పాట షరతులు, వివరములు పాట కాలమందు చదివి వినిపించబడును. లేదా ముందుగా దేవస్థానం కార్యాలయము నందు అడిగి తెలుసుకొనవచ్చును.

వ. నెం.	గ్రామము	ఆర్.ఎస్.నెం.	భూమి విస్తీర్ణం య.సెం	ప్రధమ ధరావత్తు
1.	తేతలి	312/4	4.07	8000
2.	తేతలి	175/1	0.32	1000
3.	దువ్వ	779/2	0.40	1000

స్థలం : తేతలి
తేది : 15.06.2024
ఇట్లు
ఫౌండరు ఫ్యామిలీ మెంబరు, శ్రీరాజేశ్వరస్వామి దేవస్థానం